# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 51 వ భాగం

## దుష్యంతుడి చరిత్ర – 3

దుష్యంతుడు ఇలా అడవికి వేటలో వచ్చి కణ్వాశ్రమంలో అద్భుతాలన్నీ చూసాక శకుంతల కనిపించింది కదా? ఆవిడని చూసాక రాకుమారిలా ఉంది కానీ ఇక్కడ అడవిలో ఎందుకు ఇలా ఉందో అనే సందేహం వచ్చింది. వెళ్ళి అడిగాడు పేరు ఏమిటి, ఇక్కడ ఇలా వంటరిగా ఎందుకు ఉన్నావు అని.

వ. అని పలుకుచున్న రాజకుమారుని వదనచంద్రికారసంబు నేత్ర చకోరంబులవలనం ద్రావుచు, నయ్యువిద విభ్రాంతయై యున్న సమయంబున.
[9-614]

క. కంఠేకాలునిచేతం
గుంఠితుఁడగు టెట్లు మరుఁడు? కుసుమాస్త్రంబుల్
లుంఠించి గుణనినాదము
ఠంఠమ్మన బాల నేసె ఠవఠవ గదురన్. [9-615]

మరుడు (మన్మధుడు) ఈ సమయంలో పుష్పబాణాలు ఒక్కొక్కటిగా తీసి "ఠం, ఠం" అనే శబ్దంతో శకుంతల టక టక మని (ఠవ ఠవ గదురన్) మీద సంధించాడు (లుంఠించి). మరి మన్మధుడు శివుడి వల్ల (కంఠేకాలుడు – నల్లటి కంఠం ఉన్నవాడు; హాలాహలం అనే విషం వల్ల కంఠం నల్లబడినవాడు – శంకరుడు) దహింపబడ్డాడు (కుంఠితుడగు) అనేది ఎలా నమ్మగలం? అంటే దుష్యంతుణ్ణి చూసిన శకుంతలకి కూడా ఆయనమీద ఇష్టం ఏర్పడింది.

ఇంతటి సందర్భంలో కూడా సరదాగా నవ్వు తెప్పించే పద్యం రాయడం పోతనకే దక్కుతుంది. ఇటువంటి పద్యాలలో పోతనలోని అసలు సిసలు శివభక్తుడు బయటకొచ్చి మనకి కనిపిస్తూ ఉంటాడు. రాముడు భాగవతం రాయమన్నాడు కదా అని తన ఇష్టదైవాన్ని మనసులోంచి తుడిచేయలేదు పోతన. ఈ పద్యంలో "ఠ" అనే అక్షరాన్ని పోతన ఎలా వాడాడో గమనించారా? ముందు వామనావతారం వ్యాసాల్లో కూడా పోతన "క్ష, ఱ, ణ" అక్షరాలని వాడి పద్యాలని రాయడం చూసాం (ప్రక్షీణ దివిజ వల్లభ రక్షాపరతంత్రుఁ డగుచు ... [8-525], వెఱచుచు వంగుచు వ్రాలుచు నఱిముఱిఁ గబురులకుఁ జనుచు .. [8-538], సురలోక సముద్ధరణము నిరతశ్రీకరణ మఖిల నిగమాంతాలం కరణము ... [8-605]). అసలు మనం పూర్తిగా మర్చిపోయి తెలుగులోంచి తీసేసిన ఞ, ఙ అనే అక్షరాలతో కూడా పోతన పద్యాలు రాసినా మనం ఆశ్చర్యపోవక్కర్లేదు. పోతన కవితా పటిమ అటువంటిది. ఆయన తెలుగు సాహిత్యంలో అక్షయ సమ్మోహనాస్త్ర తూణీరుడు మొదట్లోనే చెప్పినట్టుగా.

వ. ఇట్లు వలరాచవాని క్రొవ్విరికోలలవేఁడిమిఁ దాలిమిపోఁడిమి చెడి, యా వాలుఁగంటి యిట్లనియె. [9-616]

ఈ చిన్న “తెలుగు” వాక్యానికి అర్థం చదివే ముందు అసలు ఈ వచనం ఏం చెప్తోందో మనలో ఎంతమందిమి చెప్పగలం? వలచరానివాడు (మన్మథుడు), క్రొవ్విరికోలలవేడిమి (కొవ్వుతో ఉన్న, విరి = పూల, కోలలు = బాణాలు, వేడిమి), దాలిమిపోడిమి చెడి (తాలిమి = ఓర్పు, పోడిమి = నేర్పు, కోల్పోయి); అంటే దుష్యంతుడి మీద ఏర్పడ్డ ఇష్టం వల్ల మనసు ఆయనమీద పోగొట్టుకుని ఇలా అంది.

 మ. "అనివార్యప్రభ మున్ను మేనకయు విశ్వామిత్రభూభర్తయుం
గని; రా మేనక డించిపోయెనడవిం; గణ్వుండు నన్నింతగా
మనిచెన్; సర్వము నామునీంద్రుఁ డెఱుఁగున్; మద్భాగధేయంబునన్
నినుఁగంటిం బిదపం గృతార్థ నగుచున్ నేఁడీ వనాంతంబునన్. [9-617]

అమోఘమైన కీర్తితో నన్ను విశ్వామిత్రుడు, మేనక కన్నారు. వాళ్ళు విడిచిపోయాక కణ్వుడు నన్ను ఇలా పెంచాడు ఇక్కడే. అన్ని విషయాలూ ఆయన చెప్తారు. ఇన్నాళ్ళకి నేను మిమ్మల్ని చూడగలిగాను. ఇక్కడ తన తండ్రి అయిన విశ్వామిత్రుణ్ణి మేనక ఏమంటోంది? భూభర్త, అంటే రాజు. మొదట్లో దుష్యంతుడికి కలిగిన సందేహానికి సమాధానం చెప్తోంది, నేను రాజుకి పుట్టినదానినే, రాకుమారినే సుమా అని.

క. నీ వారము ప్రజలేమును
నీవారము పూజగొనుము నిలువుము నీవున్
నీవారును మా యింటను
నీవారాన్నంబుగొనుఁడు నేఁడు నరేంద్రా! " [9-618]

మేము కూడా మీ ప్రజలకిందే లెక్క, ఇక్కడ మా అతిధ్యం స్వీకరించవచ్చు అని చెప్తోంది శకుంతల. ఈ పద్యం లో “నీవార” అనేదాన్ని నాలుగు పాదాల్లో ఎలా చక్కగా వాడాడో గమనించారా? ఒకే రకం అక్షరాలతో పదాలతో ఇలా రకరకాల అర్థాలు తీస్తూ వాడడం యమకాలంకారం అంటారు. ఇలాంటివి మొత్తం పోతన భాగవతంలో పదుల, వందల సంఖ్యల్లో చూడవచ్చు.

వ. అని పలికిన, దుష్యంతుండు మెచ్చి, మచ్చెకంటి యిచ్చ యెఱింగి యిట్లనియె. [9-619]

ఆ. "రాజతనయ వగుదు రాజీవదళనేత్ర!
మాట నిజము లోనిమాటలేదు
తనకు సదృశుఁడయిన తరుణునిఁ గైకొంట
రాజసుతకుఁ దగవు రాజవదన! " [9-620]

ఈ మాటలు విన్న దుష్యంతుడికి సందేహం తీరిపోయింది. నా మనసులో అనుకున్నట్టే నువ్వు రాజకుమారివినే నన్నమాట. క్షత్రియ కన్యలు వాళ్ళ ఇష్టం వచ్చినవాళ్లని వివాహం చేసుకోవడం సమ్మతమే కదా అన్నాడు. పై వచనంలో మచ్చెకంటి అంటే? మత్స్యము అంటే చేప కదా? వికృతిలో మచ్చెము

అనుకుంటే మచ్చెకంటి అనేది చేపకనులు కలది – శకుంతల అని తెలుతుంది. తెలుగు ఇంత కష్టమా అర్థం చేసుకోవడం అనిపిస్తోందా? మరి ఈ పద్యాలు పోతన వేసే బ్రహ్మాస్త్రాలు కదా అందువల్ల మనలాంటి వాళ్ళకి ఆ అస్త్రసంపద సులభంగా అర్ధమవడం కష్టం.

క. బంధురయశుఁడు జగన్నుత
సంధుఁడు దుష్యంతుఁ డుచిత సమయజ్ఞుండై
గంధగజగమన నప్పుడు
గాంధర్వవిధిన్ వరించె గహనాంతమునన్. [9-622]

అలా తనని ఇష్టపడిన శకుంతలని బంధురయశుడు (చక్కటి కీర్తి కలవాడు), జగన్నుత సంధుడు (లోకం చేత కీర్తింపబడేవాడు) అయిన దుష్యంతుడి గాంధర్వవిధిన వివాహం చేసుకున్నాడు.

కథ ప్రకారం రాజుగారు వెళ్ళిపోయారు వెనక్కి శకుంతలని పిలిపిస్తానని చెప్పాడని కొంతమందీ, అసలు ఆయనకి ఈ శకుంతల ఎవరో మరోసారి గుర్తేలేదని కొంతమందీ రాసారు. మనం ఆ వివాదాల జోలికి పోకుండా పోతన రాసిన భాగవతం కథమీద దృష్టి సారిద్దాం. ఇలా వెళ్ళిపోయాక శకుంతలకి ఓ భరతుడనే కుర్రవాడు పుట్టాడు. వాడెటువంటివాడు?

క. కుంఠితుఁడుగాక వాఁడు
త్కంఠం దన పిన్ననాఁడె కణ్వవనచర
త్కంఠీరవ ముఖ్యంబుల
కంఠములం బట్టి యడుచుఁ; గట్టున్; విడుచున్. [9-624]

పసితనంలోనే సింహాల కంఠాలు పట్టుకుని లొంగదీసుకునేవాడు. మరో సారి “ఠ” అక్షరం ఎలా వాడాడో తెలుస్తోంది కదా ఈ పద్యంలో? (కుంఠితుఁడుగాక = మొక్కపోని ధైర్యంతో, వాడుత్కంఠం = వాడు, ఉత్కంఠముతో, కంఠీరవము = సింహము). ఇలా పెరుగుతున్నాడు కుర్రాడు ఆశ్రమంలో. ఇదంతా కణ్వుడు చూసాడు. ఇంక వీళ్ళిద్దరూ ఇక్కడ ఉండ కూడదు; రాజు దగ్గరకి పంపిద్దామని నిశ్చయించుకుని శకుంతలతో చెప్తున్నాడు.

ఉ. "పట్టపురాజు నీ మగఁడు; పాపఁడు నన్నిట నెక్కు డంతకుం;
బట్టపుదేవివై గఱువ బాగున నుండక పాఱువారితో
గట్టువనంబులో నవయఁగాఁ బనిలే దిటఁ దర్లిపోఁగదే
పుట్టిన యిండ్ల మానినులు పోరచిగా ననిశంబు నుందురే? " [9-626]

మీ ఆయన మహారాజు. నీ కుర్రాడు చూస్తే అద్భుతంగా అన్నింటిలోనూ అందెవేసిన చెయ్యిలా పెరుగుతున్నాడు. పట్టపురాణివై ఉండాల్సినదానివి ఇక్కడ ఆశ్రమంలో, పరాయివారితో, అడవుల్లో ఉండడం అనవసరం. అలా అన్ని రాజు దగ్గరకి పంపించాడు.

క. "ఆ పిన్నవాని నతుల
వ్యాపారు నుదారు వైష్ణవాంశోద్భవునిం

జూపెద" నంచు శకుంతల
భూపాలునికడకు వచ్చెఁ బుత్రుని గొనుచున్. [9-628]

శకుంతల అలా భరతుణ్ణి తీసుకొచ్చి దుష్యంతుడి దగ్గిరకి వచ్చింది. ఆ కుర్రవాడు సాక్షాత్తూ వైష్ణవాంశతో పుట్టినవాడు. వీణ్ణి చూపించి దుష్యంతుడికి చెప్తాను తానెవరో అనుకుంటూంది. అంటే దుష్యంతుడు రాజు కదా, తీరా వెళ్ళి కలిసాక నువ్వెవరో నాకు తెలియదు అని బుకాయిస్తే కుర్రాణ్ణి ఆధారంగా చూపించవచ్చు అని ఆలోచన. మరి దుష్యంతుడికి పుట్టినవాడు వైష్ణవాంశ సంభూతుడెలాగ అవుతాడు? దానికి ఈ శ్లోకం ఆధారం (రామాయణ సర్వస్వం గ్రంథం) గా అర్థం చూద్దాం.

నానృషిః కురుతే కావ్యం, నాసురో విందతే బలం
నదేవాంశో దదత్యన్నం, నావిష్ణు పృథ్వీపతిః

ఋషి కానివాడు కావ్యకర్త కాలేడు, అసురుడికి బలం లేదు, అలాగే దేవాంశతో పుట్టనివాడు అన్నం దానం ఇవ్వలేడు, విష్ణువు అంశతో పుట్టనివాడు రాజు కాలేడు. అంటే దుష్యంతుడు రాజు అవడం వల్ల విష్ణువు అంశతో పుట్టినవాడే. అందువల్ల భరతుడు వైష్ణవాంశోద్భవుడు అయ్యాడు కదా?

వ. వచ్చి దుష్యంతుండున్న సభామండపంబునకుం జని నిలిచి యున్న యెడ. [9-629]

మ. వల కేలన్ గురుచక్రరేఖయుఁ బదద్వంద్వంబునం బద్మరే
ఖలు నొప్పారఁగ నందు వచ్చిన రమాకాంతుండు నాఁ గాంతి న
గ్గలమై యున్న కుమారు మారసదృశాకారున్ విలోకించి తాఁ
బలుకం డయ్యె విభం డెఱింగి సతి విభ్రాంతాత్మ యై యుండగన్. [9-630]

ఇలా వచ్చిన శకుంతలనీ, పాదాల్లో పద్మరేఖలూ చేతిలో సుదర్శన చక్రం ధరించిన విష్ణువులా కనిపిస్తున్న కొడుకునీ చూసికూడా ఏమీ మాట్లాడకుండా విభ్రాంతితో అలా చూస్తూ ఉన్నాడు దుష్యంతుడు. శకుంతల ఏమి చేయాలో తోచనిదానిలా అలా నిలబడి ఉంది భరతుడితో.

మ. "అదె నీ వల్లభ; వాఁడు నీ సుతుఁడు; భార్యాపుత్రులం బాత్రులన్
వదలంగా; దలనాఁటి కణ్వవనికా వైవాహికారంభముల్
మది నూహింపు; శకుంతలావచనముల్ మాన్యంబుగా భూవరేం
ద్ర! దయం జేకొను" మంచు మ్రోసెను వియద్వాణీవధూవాక్యముల్. [9-632]

అప్పుడు ఆకాశవాణి ఇలా అంది. “ఈవిడ నీ భార్యే. ఈ కుర్రవాడు నీకు కణ్వాశ్రమంలో శకుంతలని కలిసినప్పుడు పుట్టిన బిడ్డే. ఓ సారి ఆ ఆశ్రమంలో జరిగినవి గుర్తు తెచ్చుకో. అలా యోగ్యులైన భార్యా పుత్రులని వదిలేయకూడదు. వీళ్ళని స్వీకరించాలి.”

వ. ఇట్లశరీరవాణి సర్వభూతంబులకుఁ దేటపడ భరింపు మని పలికిన, నా కుమారుండు భరతుండయ్యె; నంత నా రాజు రాజవదన నంగీకరించి తనూభవుం జేకొని కొంతకాలంబు రాజ్యంబుజేసి పరలోకంబునకుం జనియె; తదనంతరంబ.

[9-633]

క. రెండవహరి క్రియ ధరణీ
మండలభారంబు నిజసమంచితబాహా
దండమున నిలిపి తనకును
భండనమున నెదురులేక భరతుం డొప్పెన్. [9-634]

ఇలా ఆకాశవాణి చెప్పాక వాళ్లని స్వీకరించాడు. మరి మొదట్లో ఎందుకలా మాట్లాడకుండా ఉన్నాడు ఆకాశవాణి చెప్పేదాకా అంటే, ఏమో ఎవరేమనుకుంటారో, నేను ఇలా అడవిలోకి వెళ్ళి ఈవిణ్ణి పెళ్ళి చేసుకున్నానని చెప్తే అనుకుని ఉండవచ్చు. ఓ సారి ఇలా తెలియగానే ఇంక అన్ని సందేహాలు తీరిపోయి కథ సుఖాంతం అయింది. అలా దుష్యంతుడు కొంతకాలం రాజ్యం చేసి భరతుడికి రాజ్యం ఇచ్చాడు.

వ. మఱియునా దౌష్యంతి, యమునాతటంబున దీర్ఘతపుండు పురోహితుండుగా డెబ్బదియెనిమిదియును, గంగాతీరంబున నేఁబది యయిదును, నిట్లు నూటముప్పదిమూఁడశ్వమేధయాగంబులు సదక్షిణంబులుగా నొనర్చి; దేవేంద్రవిభవంబున నతిశయించి, పదుమూఁడువేలునెనుబదినాలుగు కదుపుధేనువులుగలయది ద్వంద్వంబనం బరఁగు, నట్టి వేయి ద్వంద్వంబుల పాఁడిమొదవులఁ గ్రేపులతోడ నలంకారసహితలం జేసి వేవురు బ్రాహ్మణుల కిచ్చి, మష్కార తీర్థకూలంబున విప్రముఖ్యులకుఁ బుణ్యదినంబున గనక భూషణ శోభితంబులయి ధవళదంతంబులు గల నల్లని యేనుంగులం బదునాలుగులక్షల నొసంగె; దిగ్విజయకాలంబున శక, శబర, బర్బర, కష, కిరాతక, హూణ, మ్లేచ్ఛ దేశంబుల రాజులఁ బీచంబడంచి, రసాతలంబున రాక్షస కారాగృహంబులందున్న వేల్పుల గరితలం బెక్కండ్ర విడిపించి తెచ్చి, వారల వల్లభులం గూర్చె; త్రిపురదానవుల జయిచి; నిర్జరుల నిజమందిరంబుల నునిచె; నతని రాజ్యంబున గగన ధరణీతలంబులు ప్రజలుగోరిన కోరిక లిచ్చుచుండె; నివ్విధంబున. [9-635]

అలా ఆ దౌష్యంతి – దుష్యంతుడికి పుట్టినవాడు, భరతుడు – యమునతటంలో నూటముప్పై అశ్వమేధాలు చేసాడు. ఆయా సమయాల్లో దానాలు చేసి అనేక రాజ్యాలు తన అధీనంలోకి తెచ్చుకుని రాజ్యం చేసాడు.

ఆ. సత్యచరితమందుఁ జలమందు బలమందు
భాగ్యమందు లోకపతులకంటె
నెక్కుడైన పేర్మి నిరువదియేడువే
లేండ్లు ధరణి భరతుఁ డేలె నధిప! [9-636]

ఇలా భరతుడు సత్యవర్తనతో, పట్టుదలతో (చలమందు), బలంతో, సంపదలతో ఇరవై ఏడువేల ఏళ్ళు రాజ్యం చేసాడు. ఆ తర్వాత ఈ భరతుడి కథ మిగతా రాజులలాగానే అంతమవుతుంది. ఈ భరతుడి పేరుమీదే భారత దేశం అనే పేరు వచ్చిందని మనకి తెలిసిన కథే.

ఈ భరతుడి తర్వాత కథ అంత సంతోషంగా ఉండదు భాగవతంలో. ఈయనికి పుట్టిన పిల్లలని ఆయన ముగ్గురు భార్యలూ చంపేస్తారు; ఎందుకంటే వాళ్ళు భరతుడంతటి గొప్పవాళ్ళు కారని అనుకోవడం వల్ల. అలా వాళ్ళు పిల్లలని అంతమొందించాక, ఆయన వంశం నిలబెట్టవాడి గురించి మరుత్సోమం అనే యజ్ఞం చేయడం జరుగుతుంది. తర్వాత మరో మలుపు తిరుగుతుంది కథ. ఎక్కడో బృహస్పతీ, మమతా అనే వాళ్ళకి పుట్టిన ఇద్దరి పిల్లలలో ఒకాయనకి చూపు పోతుంది. రెండోవాణ్ణి వీళ్ళిద్దరూ 'నువ్వు పెంచు అంటే నువ్వే పెంచు' అని వాదులాడుకుని వాణ్ణి వదిలేసి వెళ్ళిపోతారు. అలా

ఎవరికీ దక్కని కుర్రాణ్ణి మరుత్తులు పెంచుతూ ఉంటారు. వాణ్ణి తీసుకొచ్చి భరతుడికిస్తారు (యజ్ఞం ఫలితంగానే ఈ కుర్రాడు దొరికాడు అనుకోవడమే). ఆ పిల్లాడి పేరు భరద్వాజుడు. పిల్లలు లేని భరతుడి వంశాన్ని నిలబెట్టాడు కనక ఆయన్ని వితథుడు అని పిలవడం మొదలుపెడతారు. అలా వంశం విస్తరించి రంతిదేవుడు మరో తరంలో పుడతాడు అదే వంశంలో.

ఆ రంతిదేవుడినుంచి పాంచాలులు, బృహద్ధృధులు, శంతనుడు, భీష్ముడు, అక్కడనుంచి కౌరవ పాండవులూ ఇదంతా ఒక్కొక్క పొరా విప్పుకుంటూ మహాభారతం, ప్రస్తుతం శుక మహర్షి వినిపించే కథ వింటున్న పరీక్షిత్తూ వస్తారు. అలాగే యదువంశం ఎలా మొదలైందీ అక్కడ్నుంచి భాగవత కథలో అసలు సిసలు కథానాయకుడు, లీలామానుష విగ్రహుడిగా చెప్పబడే కృష్ణుడూ, శ్రీకృష్ణ లీలనూ గమనించవచ్చు. అవన్నీ ముందు రాబోయే వ్యాసాల్లో చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS